రైతులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే

- అధిక వర్షాలతో తీవ్ర నష్టం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సీతానగరం, కోరుకొండ మండలాల్లో ముంపు పొలాల పరిశీలన



రాపాక గ్రామంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రైతులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకుంటున్న జక్కంపూడి రాజా

సీతానగరం/మధురపూడి: అధిక వర్షాలు, గోదావరి వరదల వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆయన గురువారం సీతానగరం మండలంలోని కాటవరం, చినకొండేపూడి, రాపాక, కూనవరం, కోరుకొండ మండలంలోని కోటి, శ్రీరంగపట్నం, మునగాల, బుచ్చింపేట గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ సీతానగరం, కోరుకొండ మండలాల్లో వేల ఎకరాల పొలాలు నీట మునిగాయని న్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సీతానగరం మండలంలోని 16 గ్రామాల పరిధిలో 3,545, కోరుకొండ మండలంలోని 8 గ్రామాలలో 580 హెక్టార్ల పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం కూడా ఉందన్నారు.

గత ప్రభుత్వంలో వెంటనే నష్టపరిహారం

జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆ సీజన్‌లోనే నష్టపరిహారం అందించేవారన్నారు. ప్రస్తుతం వరద ప్రభావంతో పంట ముంపునకు గురై, అన్నదాతలకు కోలుకోని నష్టం మిగిల్చిందన్నారు. పంటనష్టం అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించి, త్వరితగతిన రైతులను ఆదుకోవాలన్నారు. కోరుకొండ, సీతానగరం మండలంలో ముంపు సమస్య పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని, వాటికి సంబంధించిన జీవోలు విడుదలై, టెండర్లను కూడా పిలిచారన్నారు. సుదీర్ఘ కాలంగా ఉన్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకురావడం కోసం రూ.91 కోట్లతో తొర్రిగెడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్‌ను తీసుకురావడం జరిగిందని, వెంటనే వాటికి సంబంధించిన పనులను ప్రారంభించాలన్నారు. ముంపు సమస్య పరిష్కారంలో భాగంగా సీతానగరం మండలంలోని రాపాక కాలువ మీద, వివిధ మైనర్ ఇరిగేషన్ పనుల కోసం మరో రూ.38 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. వాటికి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఆ పనులను త్వరితగతిన చేపట్టేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

ఏటిగట్టును పటిష్టం చేయాలి

సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకూ ఉన్న ఏటిగట్టు పటిష్టం చేసే పనిలో భాగంగా ఆర్‌సీసీ వాల్ నిర్మించేందుకు రూ.24 కోట్ల నిధుల కోసం గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో నిధులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని సత్వరమే ఏటిగట్టు పటిష్టతకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవాటికి పనులకు సంబంధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి మంజూరు చేయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీతానగరం, కోరుకొండ మండలాల ఎంపీపీలు గుర్రాల జ్యోత్స్న, ఉల్లి వీర వెంకట సత్యసూర్య కుమారి, జెడ్పీటీసీలు చల్లమళ్ల వెంకటలక్ష్మి, కర్రి నాగేశ్వరరావు, మండల కన్వీనర్లు ఘంటా శ్రీనివాస్, అడప కనకరాజు, గణేవుల పోశయ్య, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు నక్కా రాంబాబు, చల్లమళ్ల సుజీరాజు, పోలినాటి ఈశ్వరుడు, పిచ్చుకుల రవికుమార్, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, సత్తిపండు రాజు, ముదునూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేంద్రబాబు



సీతానగరం: ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇనుగంటివారిపేటకు చెందిన ఆరాధ్యుల నరేంద్రబాబు శర్మ ఎంపికయ్యారు. విశాఖపట్నం శిల్పారామంలో బుధవారం జరిగిన సమాఖ్య సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, అధ్యక్షుడు పాదిలి నారాయణమూర్తి చేతుల మీదుగా ఆయన నియామకపత్రాలను అందుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు జ్యోస్యుల సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు మర్ల సీతారామశాస్త్రి తదితరులు నరేంద్రబాబు శర్మను అభినందించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న నన్నయ ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ద్విచక్ర వాహన చోదకులందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు చాలామంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలవచర్ల లిఫ్ట్ నుంచి నీరు విడుదల



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: పుష్కర ఎత్తిపోతల పథకంపై కలవచర్ల వద్ద ఏర్పాటు చేసిన లిఫ్ట్ నుంచి గోదావరి జలాలను స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం విడుదల చేశారు. దివంగతనేత జక్కంపూడి రామ్మోహనరావు అభ్యర్థన మేరకు 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ లిఫ్ట్‌ను ఏర్పాటుచేశారు. దీనిద్వారా కలవచర్ల, సీతారామపురం, గాదరాడ, నర్సాపురం మున్నగు గ్రామాలలోని భూములకు నీరు అందుతోంది. గోదావరి జలాల విడుదల సందర్భంగా వచ్చిన ఎమ్మెల్యేతో పొలాలలో ఉన్న పలువురు రైతులు, కూలీలు ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులతోపాటు స్థానిక టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



పెద రాయవరంలో కొలువైన షిరిడీ సాయిబాబా

రంగంపేట: మండల పరిధిలోని పెద రాయవరం గ్రామంలో కొలువైయున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొనసాగుతున్న గురుచరిత్ర పారాయణ



గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుచరిత్ర పారాయణ రెండో గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. లోకకల్యాణార్థం చేపట్టిన 11 వారాల పాటు గురుచరిత్ర పారాయణ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. స్థానిక సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఇచ్చిన కాకడ హారతి అనంతరం పారాయణను ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి చేశారు. ఒక్కొక్కరు రెండు నుంచి ఐదు అధ్యాయాలు పఠిస్తూ, భక్తిపారవశ్యంతో పారాయణ చేస్తున్నారు. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం రాజమహేంద్రవరానికి చెందిన శాంతిస్వరూప్ ఆధ్వర్యంలో భజన, సంకీర్తనలు ఆలపించారు.

బాధిత కుటుంబాలకు జక్కంపూడి రాజా పరామర్శ



చినకొండేపూడిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం/మధురపూడి: కోరుకొండ, సీతానగరం మండలాల్లో పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. సీతానగరం మండలం రఘుదేవపురంలో ప్రగాడ సూర్యకాంతం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుడు ప్రగాడ రమేష్‌ను పరామర్శించారు. దాసరి గిరిబాబు మరణించగా సోదరులు దాసరి బాబీ, లక్ష్మణ్ రావులను ఓదార్చారు. చిన కొండేపూడిలో ఇటీవల మరణించిన బైర్రాజుల బుల్లి సత్తిరాజు, బైర్రాజు రామసీత, తూము సూరయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కూనవరంలో దూలం వెంకటలక్ష్మి, అడబాల రాజు, సాలి అన్నవరం, సుంకర వీరబాబు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న తళ్లారి రాజు, బొండేటి వెంకట రమణను పరామర్శించారు. కణుపూరుకు చెందిన మూలపర్తి జయరాజు, చీర్ల పెద సూర్యారావు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను, మాతృవియోగంతో బాధపడుతున్న బడిపాటి రమేష్‌ను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంట ఎంపీపీలు గుర్రాల జ్యోత్స్న, సూర్యకుమారి, వైస్ ఎంపీపీ ముదునూరి సురేష్‌రాజు, కన్వీనర్లు ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ముదునూరి రామకృష్ణంరాజు, మణి రాజు, సత్తిపండు రాజు, బంగారయ్య, పాల్ శ్రీనివాస్, అంబటి రాజు, మాకిరెడ్డి సాయి ఉన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెదపూడి: విద్యార్థులు చిన్నతనం నుంచి పోటీతత్వం అలవరుచుకోవాలని అర్తమూరుకి చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ కోనాల సత్తిరెడ్డి, ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. అనపర్తిలోని ఎస్‌డీబీ జెడ్పీ, కుతుకులూరు, బిక్కవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీమెటీరియల్ సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువుల బారిన పడొద్దు

- రైతులకు సూచిస్తున్న వ్యవసాయాధికారులు
- కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



పెదపూడిలోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు(ఫైల్)

పెదపూడి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఈ తరుణంలో రైతులు పంట పొలాలకు ఎరువులు అధికంగా వినియోగిస్తారు. ఇదే అదునుగా మార్కెట్‌లోకి నకిలీ ఎరువులు, పురుగుల మందులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. కొనుగోలు సమయంలో అప్రమత్తంగా లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉంది. ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని అన్ని వివరాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 45,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అనపర్తి మండలంలో 12,000 ఎకరాల్లో, పెదపూడి మండలంలో 18,500 ఎకరాల్లో, రంగంపేట మండలంలో 2,000 ఎకరాల్లో, బిక్కవోలు మండలంలో 13,000 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఇప్పటికే దాదాపుగా వరినాట్ల ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం ఎరువులు జల్లడం, పురుగుమందుల పిచికారీ చేసే పనిలో అన్నదాతలు నిమగ్నమై ఉన్నారు. 1985 ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు కూడా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. తక్కువ ధరకే ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నారని లైసెన్సు లేని వ్యక్తులు, దుకాణాలు, దళారులు, ఇతతత్రా వ్యాపారుల నుంచి రైతులు ఎరువులు కొనుగోలు చేయకూడదు. డీలరున మోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. ఎరువులు, వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎర్రటి సిరాతో గుర్తు వేసి పక్కన పెట్టేయాలి. ఎరువుల సంచులపై సీలు విప్పినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే రైతులు కొనకూడదు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బస్తాలో లభించే చీటీ(ట్యాగ్) ఉందో లేదో గమనించాలి. చీటీ ఉంటేనే కొనుగోలు చేయాలి. ఆ చీటీని ఏడాది పాటు భద్రంగా ఉంచుకోవాలి. క్రిమి సంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు, తయారీ తేదీ, కాల పరిమితిని గమనించి అందుకు అనుగుణంగా బిల్లులు తీసుకోవాలి. ఏదీ ఎంత ధరకు కొన్నా డీలర్ లేదా దుకాణదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవని అనుమానం వస్తే మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు.

పరిశీలన తప్పనిసరి



రైతులు పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించుకోవలి. ఎక్కడైనా నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే ఆయా దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లులను అందజేయాలి.

– టీవీఆర్ మణిదీప్, ఏఓ, పెదపూడి

బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలి



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



రాజానగరం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: తల్లికి మొదట వచ్చే ముర్రుపాలను బిడ్డకు తప్పకుండా తాగించాలని పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎన్.రాజు తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ముర్రుపాలు పట్టడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే ఆరు నెలల వయసు వచ్చే వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఏ విధమైన ఇతర ద్రవాలు ఇవ్వరాదన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.వెంకటరత్నం, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, హెల్త్ అసిస్టెంట్ పి.నందీశ్వరరావు, ఏఎన్ఎం ఎస్‌కే మున్నీషా బేగం, అంగన్‌వాడీ కార్యకర్త పుష్పరత్నం పాల్గొన్నారు.

రాజానగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు నిర్వహించే తల్లి పాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీని నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లి పాలు బిడ్డకు ఏ విధంగా మేలు చేస్తాయో వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ



రంగంపేటలో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నం

రంగంపేట: మండలంలో 8,970 మంది లబ్ధిదారులకు గాను 8,636 మందికి అంటే తొలిరోజే 96 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ పి.వెంకటరత్నం గురువారం తెలిపారు. సాంకేతిక సమస్యలు వచ్చిన వారికి శుక్రవారం పింఛన్లు అందిస్తామన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన స్పీకర్

పెదపూడి: అనపర్తి మండలం రామవరంలో గ్రామంలో రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

కవితాక్షరానికి వన్నెలద్దిన తిలక్



సమావేశంలో మాట్లాడుతున్న విశాలాక్షి

సీటీఆర్ఐ: కృష్ణశాస్త్రి, శ్రీశ్రీల ప్రభావంతో భావాభ్యుదయ కవిత్వాన్ని ఆవిష్కరించిన మానవతావాది దేవరకొండ బాల గంగాధర తిలక్ అని ఎస్‌కేఆర్ డీఈడీ మహిళా కళాశాల తెలుగుశాఖాధిపతి విశాలాక్షి అన్నారు. కళాగౌతమి, ఎస్‌కేవీటీ తెలుగుశాఖ సంయుక్త నిర్వహణలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో గురువారం తిలక్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాలాక్షి మాట్లాడుతూ కరుణ, సౌందర్యం, మానవత్వం తిలక్ కవిత్వానికి ప్రాతిపదికలన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ తిలక్‌ను సౌందర్య, కారుణ్య కవిగా అభివర్ణించారు. సమావేశంలో ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రేపు జాబ్ మేళా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ, ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన విద్యార్థులు 8 బహుళజాతి సంస్థల్లోని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు తమ అర్హత ఒరిజినల్, జిరాక్సు కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కళాశాల జేకేసీ విభాగాన్ని సందర్శించవచ్చని తెలిపారు.

ప్రజా సమస్యలపై విస్తృత పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రకాశం నగర్: ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటం సాగిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. తాడితోటలోని సంహిత ఫంక్షన్ హాలులో గురువారం జిల్లా అధ్యక్షుడు తాటిపాక మధు అధ్యక్షతన సీపీఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులేసు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీకి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి నూరు వసంతాలు నిండుతాయన్నారు. ఈ సందర్భంగా 2024 డిసెంబర్ 26 నుంచి 2025 డిసెంబర్ 26 వరకూ ఏడాది పాటు శతదినోత్సవం ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్రం ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ గ్రామాలలో అనేక ప్రజా సమస్యలు నెలకొన్నాయన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతిరాజు, చింతలపూడి సునీల్ ప్రసంగించారు. అంతకుముందు ప్రజానాట్యమండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మహంతి లక్ష్మణరావు నాయకత్వంలో పలు విప్లవ గీతాలను ఆలపించారు. వయనాడ్ సీపీఐ సహాయనిధికి జిల్లా నుంచి 10,120 ఆర్థిక సహాయం అందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం రంగంపేట గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజానగరం: కానవరం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కానవరం, చక్రద్వారబంధం, ఫరిజల్లిపేట గ్రామాలలో విద్యుత్ ఉండదన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



కూరగాయల అలంకరణలో అమ్మవారు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల లోని మహాలక్ష్మీ సమేత చిన్నవెంకటేశ్వరస్వామి పీఠంలో అమ్మవారు గురువారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

నెలకో సంక్షేమ పథకం అమలు

రాజానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను నెలకొక్కటి చొప్పున అమలులోకి తీసుకువస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. దివాన్ చెరువులో గురువారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి అమలు అవుతుందన్నారు. మూడు గ్యాస్ సిలెండర్లు, మహిళలకు నెలకు రూ.1500 పథకాలు కూడా ఒకదాని తరువాత ఒకటిగా అమలు జరుగుతాయన్నారు.

మొబైల్ షాప్ దగ్ధం



కాలిపోయిన మొబైల్ షాపు

కంబాలచెరువు: దేవీచౌక్‌లోని సత్యా రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ప్రతాప్ మొబైల్ షాపు దగ్ధమైంది. దీనిపై షాపు మేనేజర్ మామిడి వెంకట శ్రీనివాస్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మొబైల్ దుకాణానికి బుధవారం రాత్రి యథాతథంగా తాళం వేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. గురువారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు రావడాన్ని పక్కనే ఉన్న పాల దుకాణం వ్యక్తి చూశాడు. వెంటనే మొబైల్ షాపు నిర్వాహకులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో దుకాణంలోని రూ.40 వేలు విలువైన కీప్యాడ్ మొబైల్స్, మొబైల్ యాక్సరీస్, రూ.77,500 నగదు కాలిపోయినట్లు దుకాణం మేనేజర్ వెంకట శ్రీనివాస్ తెలిపారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే దుకాణం షట్టర్‌ను కొంతమేర లేపి నిప్పుపెట్టారని ఆయన చెబుతున్నారు. దీనిపై ఇంకా ఎటువంటి కేసు నమోదు కాలేదు.

మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి విగ్రహావిష్కరణ



పందలపాకలో మూలారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తదితరులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూలారెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.